మూడు నెలలు దాటినా అతీగతీ లేదు



తల్లికి వందనం పథకం కింద నీకు రూ. 15వేలు, నీకు రూ. 15వేలు, నీకూ రూ. 15వేలు ప్రకారం హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత స్కూల్స్ తెరిచి రెండు నెలలు ముగుస్తున్నా ఇప్పటికీ అతీగతీ లేదు. తల్లికి వందనం ఇస్తున్నట్టా, లేనట్టా, నాకు ఇద్దరు పిల్లలున్నారు. వారు 4వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం నగదు కోసం ఎదురు చూస్తున్నారు.

– జి. సౌజన్య, మార్కాపురం

తల్లికి వందనం డబ్బులు వెంటనే ఇవ్వాలి



నాకు ఇద్దరు పిల్లలు, పెద్ద వాడు 9వ తరగతి, రెండో వాడు 7వ తరగతి చదువుతున్నారు. గతంలో ప్రతి ఏడాది ఒక్క పిల్లవాడికి అమ్మఒడి డబ్బులు వచ్చేవి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ. 15వేలు చొప్పున వేస్తామని చెప్పారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు అకౌంట్లలో డబ్బులు పడలేదు. ఎప్పుడు వేస్తారో తెలియని పరిస్థితి.

– వి.సరోజ, కంభం

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?



మార్కాపురంలో ఇంజినీరింగ్‌ను పూర్తి చేసుకున్నా. ఎన్నికల హామీల్లో భాగంగా ఎన్‌డీఏ కూటమి సభ్యులు ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు నిరుద్యోగ భృతి ఊసేలేదు. గతంలో కూడా నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూశాం. నిరాశ తప్పితే భృతి అందిందే లేదు.

– కె. చెన్నకేశవులు, మార్కాపురం

ఉచిత బస్సు కోసం ఎదురుచూస్తున్నాం



ఎన్నికలప్పుడు పొదిలి వచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోనికి రాగానే ఉచిత బస్సు అమలు చేస్తానని చెప్పాడు. దీనితో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉచిత బస్సు పథకం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నా. ఇంతవరకూ అమలుకా లేదు. త్వరగా అమలు చేయాలి.

– మారం పద్మ, ఈగలపాడు

హామీలు నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇంటింటికీ తిరుగుతూ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పేరుతో ఇచ్చిన ఆరు హామీల్లో ఒకటైన ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పథకం వెంటనే అమలుచేయాలి. ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు దాటినప్పటికీ విధివిధానాల పేరుతో ఆలస్యం చేయడం తగదు.

– ప్రసాద్, కలుజువ్వలపాడు

3 ఉచిత గ్యాస్ సిలిండర్లు వెంటనే అందించాలి



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటికీ ఉచితంగా 3 సిలిండర్లు అందించాలి. విధి విధానాలు, లబ్ధిదారుల ఎంపిక పేరుతో ఆలస్యం చేయకుండా పథకాన్ని వెంటనే అమలు చేయాలి.


– దిబ్బమ్మ, తర్లుపాడు

మోసం చేయకుండా మాట నిలుపుకోవాలి



ప్రభుత్వం మోసం చేయకుండా ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి. అధికారంలోనికి వస్తే 19 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ప్రతిమహిళకు ప్రతి నెలా 1500 రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. దీనితో నమ్మి ఓట్లు వేశాము. ఇంత వరకూ అతీ గతీ లేదు. ఇచ్చినమాట నిలబెట్టుకుని ప్రతినెలా డబ్బులివ్వాలి.

– పి. నాగమణి, బట్టువారిపల్లి, పొదిలి మండలం



మాటలేమో కోటలు చేతల్లో చవటలు

టీడీపీ కూటమి హామీల అమలు దాటవేత వైఖరిపై ప్రజల మండిపాటు

- అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు పేద అరుపులు అరవడంపై సర్వత్రా విస్మయం
- నీటిపై రాతలా మారిన టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు
- ప్రభుత్వం కొలువుదీరి 100 రోజులైనా అతిగతీ లేదని ఆగ్రహం

సాక్షి నెట్‌వర్క్: అన్నదాత సుఖీభవ కాదు, అన్నదాత భవతీ భిక్షాం దేహీ అయింది. తల్లికి వందనం.. అమ్మకు తీరని శోకంలా మారింది. 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు.. ఎడారిలో ఒయాసిస్సులా మారాయి. నిరుద్యోగ భృతి.. ఓ భ్రాంతి అయింది. ప్రతి మహిళకూ ఆర్థిక సాయం.. పిట్టలదొర మాటల్లా దొర్లిపోయింది. ఉచిత బస్సు.. తుస్సుమంది. మొత్తంగా సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ తుస్‌మన్నాయి. 'బాబు అంటే మోసానికి బ్రాండ్ అంబాసిడర్. అబద్ధాల రారాజు. మాట మీద నిలబడలేని రాజకీయ నేత.. ప్రజలంటే చులకన భావంతో చూసే పెద్ద మనిషి' అని ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమికి ఓట్లేసిన జనం బాబు తీరుపై మండిపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వ పథకాలు పెద్ద ఎత్తున చేరాయి. క్యాలెండర్ ప్రకారం ప్రజలకు వెన్నుదన్నుగా నాటి ప్రభుత్వం నిలిచింది. కానీ నేటి బాబు ఏలుబడిలో అన్ని వర్గాలవారు తీవ్రంగా దగా పడినట్టైంది.

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
అమ్మఒడి	గిద్దలూరు	రూ.40.50
	మార్కాపురం	రూ.37.34

స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం


నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

గిద్దలూరు - 45,320 మంది

మార్కాపురం - 24,894 మంది

ఇవ్వాల్సిన సాయం - రూ. 112.83 (కోట్లు)

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం



పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
రైతు భరోసా	గిద్దలూరు	రూ. 54.87
	మార్కాపురం	రూ. 46.24

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

గిద్దలూరు - 40,645

మార్కాపురం - 34253

ఇవ్వాల్సిన సాయం - రూ. 149.79 (కోట్లు)



ప్రతి ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

గిద్దలూరు : 95,202 కుటుంబాలు

మార్కాపురం : 76,800 కుటుంబాలు

మొత్తం లబ్ధిదారులు: 1,72,002

ఏడాదికి ఇవ్వాల్సిన సిలిండర్లు: 5,16,006



యువతకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

గిద్దలూరు : 34,500

మార్కాపురం : 19,350

ఏడాదికి ఇవ్వవలసిన సాయం : రూ.16.35 కోట్లు



ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

గిద్దలూరు : 93,655 మంది

మార్కాపురం : 73,394 మంది

ఏడాదికి ఇవ్వవలసిన సాయం : రూ.300.50 కోట్లు



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

గిద్దలూరు : 1,46,079 మంది

మార్కాపురం : 1,16,688 మంది

తల్లికి వందనం అందరికీ ఇవ్వాలి



తల్లికి వందనం పథకం ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఇవ్వాలి. మా ఇంట్లో ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ. 15వేల చొప్పున ఇస్తామన్నారు. మా ఇంట్లో ఒకరు 8, ఇంకొకరు 9, మరొకరు ఉర్దూ పాఠశాలలో చదువుతున్నారు. ఇప్పుడు తల్లికి వందనం పథకంపై అధికారంలోనికి వచ్చిన నాయకులు స్పష్టత ఇవ్వకపోవడంతో అయోమయంలో ఉన్నాం.

– షేక్ జీనత్, మార్కాపురం

రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి



గత ప్రభుత్వంలో రైతులకు రైతుభరోసా నిధులు వచ్చాయి. పంటలు సాగు చేసుకునేందుకు ఉపయోగపడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైనా అన్నదాత సుఖీభవ నిధులు వస్తాయో రాదో తెలియడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పంటల సాగు చేపట్టారు. పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నారు. వెంటనే ఇవ్వాలి.

– కె. కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు, కొనకనమిట్ల

నిరుద్యోగ భృతి వెంటనే ప్రకటించాలి



నాపేరు నరేష్, నేను ఇంటర్ పూర్తిచేశాను. ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతిని వెంటనే ప్రకటించాలి. నిరుద్యోగులు ప్రతి ఒక్కరికి 3వేల చొప్పున ప్రతినెలా చెల్లించేవిధంగా ప్రభుత్వం విధివిధానాలు రూపొందించి అందించాలి.

– వై. నరేష్, మార్కాపురం

రూ.20 వేల కోసం ఎదురుచూస్తున్నాం



టీడీపీ అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ. 20వేలు ఇస్తారని చెప్పారు. పంటలు సాగు చేసుకునేందుకు రైతులు పొలాలు దున్నుకుంటున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం ఇస్తానన్న డబ్బులు వెంటనే ఇస్తే పెట్టుబడులకు ఉపయోగపడతాయి. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రైతులకు డబ్బులు వెయ్యాలి.

– రెడ్డి మల్లారెడ్డి, రాచర్ల

గ్యాస్ పథకం అమలు చేయాలి



ప్రతి ఇంటికీ కచ్చితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి రాష్ట్ర నేతలతో పాటు స్థానిక నేతలు కూడా ప్రచారం చేశారు. ఇప్పుడు దాని గురించి ఊసే లేదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తప్పనిసరిగా నెరవేర్చాలి.

– వల్లెపు కోటేశ్వరరావు, వి. నాగులవరం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఇంటికో ఉద్యోగం కల్పించాలి. దీనికి సంబంధించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రతి నెలా రూ. 3 వేల నిరుద్యోగ భృతి మంజూరు చేయాలి. నిరుద్యోగ భృతి విడుదల చేస్తే ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లకు వెళ్లడానికి పేద కుటుంబాలకు అనుకూలంగా ఉంటుంది.

– శివనాయక్, ఓబులాపురం

గ్యాస్ సిలిండర్లు ఎప్పుడు ఇస్తారు?



ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ధరలు విపరీతంగా పెరిగాయి. మీ కుటుంబ ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. ఈ పథకం అమలుపై ఎటువంటి ప్రకటన కూటమి ప్రభుత్వం చేయలేదు. మూడు ఇస్తే మాకు ఎంతో మేలు జరుగుతుంది.

– వై. కళావతి, అర్థవీడు

బాధ్యతలు స్వీకరించిన కంభం సీఐ

కంభం: కంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.మల్లిఖార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ జె.రామకోటయ్యను గిద్దలూరు రూరల్‌కు బదిలీ చేసి, నరసరావుపేట రూరల్ సీఐ మల్లికార్జునను కంభంలో నియమించారు. నూతన సీఐని పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ వైద్యుడిపై విచారణ!

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నిధుల దుర్వినియోగంపై బుధవారం ఒంగోలు జీజీహెచ్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి విచారణ చేపట్టారు. అభియోగాలు ఎదర్కొంటున్న డాక్టర్ ఖాదరయ్యతోపాటు వైద్యశాల సిబ్బంది, పలువురు రోగులను కూడా ఆయన విచారించినట్లు సమాచారం. అంతర్గతంగా సాగిన ఈ విచారణ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక కొరతపై ప్రభుత్వం స్పందించాలి



గిద్దలూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు



మార్కాపురంలో వినతిపత్రం ఇస్తున్న భవన నిర్మాణ కార్మికులు

- ధర్నాలో సీఐటీయూ నేతల డిమాండ్

గిద్దలూరు రూరల్: ఇసుక కొరత తీర్చాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గిద్దలూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ.. ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక అందుబాటులోకి తెస్తామని చెప్పారే తప్ప ఆచరణలోకి తీసుకురావడం లేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి.సురేష్, ఎం.భాస్కర్, నారాయణ, చెన్నకేశవ, కాశిం, డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మార్కాపురం: ఇసుక సమస్యపై సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక కార్మికశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి వంద రోజులైనా ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినపడటం లేదా అని ప్రశ్నించారు. భవన నిర్మాణ రంగంలో 36 రకాల పనులు చేసే కార్మికుల జీవితాలపై ఇసుక కొరత ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు నాగరాజు, సుబ్బరాయుడు, రాజు, అభినయకుమార్, నాగూర్‌బాబు, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



కంభం : కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

కంభం: క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ పేర్కొన్నారు. స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటలపోటీలను బుధవారం ఎంపీపీ ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ప్రావీణ్యం పొందితే భవిష్యత్తులో ఉన్నత చదువులకు, ఉద్యోగావకాశాలు పొందేందుకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, కందులాపురం సర్పంచి బత్తుల తిరుపాలమ్మ(రజని), ఎంఈఓ మాల్యాద్రి, వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, ఎన్‌సీసీ అధికారి ఇక్బాల్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

గిద్దలూరు రూరల్: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ డి.వెంకటదాసు పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్‌లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వీధుల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ఏఈ శంకర్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టపావలి, సచివాలయఉద్యోగివిష్ణుప్రియపాల్గొన్నారు.

అనధికార బాణసంచా పట్టివేత

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో ఓ దుకాణంలో అనుమతికి మించి నిల్వ ఉంచిన బాణాసంచాను పోలీసులు బుధవారం రాత్రి సీజ్ చేశారు. దుకాణదారుడికి లైసెన్స్ ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా పెద్దమొత్తంలో బాణసంచా నిల్వ ఉంచినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఐటీఐతో పుష్కలంగా ఉద్యోగావకాశాలు

మార్కాపురం: ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలో ఆయన మాట్లాడారు. చదువుపై దృష్టి పెట్టాలని, సెల్‌ఫోన్లకు బానిసలు కావద్దని డీఎం సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ హనుమానాయక్ మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచి నడవడికతో ఉండాలన్నారు. ట్రైనింగ్ ఆఫీసర్ నాగరాజు, ప్రిన్సిపాల్ ఎం.నరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంస పత్రాలు పంపిణీ



బేస్తవారిపేట : జ్ఞాపికలతో విద్యార్థినులు

బేస్తవారిపేట/తర్లుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు, ప్రసంస పత్రాలను రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామ్‌భూపాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. ప్రధానమంత్రి గుర్తించిన విశ్రాంత ఉపాధ్యాయుడు జిల్లాలోని పలు పాఠశాలల్లో పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు కేజీబీవీలో టెన్త్, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బుధవారం జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. బాలికలను విద్యలో ప్రోత్సహించేందుకు విశ్రాంత ఉపాధ్యాయుడు రాంభూపాల్‌రెడ్డి చేస్తున్న కృషిని ఎంపీడీఓ నరసింహులు కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతీదేవి, ఎంపీడీఓ ఆఫీస్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కేజీబీవీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.